# ఎన్నడూ మరువరాని

# రాత్రి

## చదువుటకు నియమించినవి #34

VII. ప్రభువు పరిచర్యలో చివరి వారం (కొనసాగింది).
  H. శుక్రవారం : యేసు మరణ దినం (కొనసాగింది).
    1. చివరి రాత్రి భోజనం (కొనసాగింది).
      సి. అణకువ ప్రదర్శింపబడింది (యోహాను 13:2–20).
      డి. అప్పగించుట/కాదనుట ప్రవచింపబడింది (మత్తయి 26:21–25, 31–35; మార్కు 14:18–21, 27–31; లూకా 22:21–23, 31–38; యోహాను 13:21–38).
      ఇ. ప్రభురాత్రి భోజనం ఏర్పాటయింది (మత్తయి 26:26–29; మార్కు 14:22–25; లూకా 22:19, 20; 1 కొరింథీ. 11:23–26[1]).

### పరిచయం

అది ఎన్నడూ మరువకూడని రాత్రి. మేడగదిలో క్రీస్తు, ఆయన అపొస్తులులును పస్కా భోజనానికి కూర్చుండడంతో ఆ రాత్రి ఆరంభమయ్యింది. అది గెత్సేమనే ప్రార్థనలతో కొనసాగింది. ప్రధాన యాజకుని సభలో అన్యాయపు తీర్పుతో అది ముగుస్తుంది. ఈ పాఠం పస్కాభోజనానికి సంబంధించి తొలి భాగాన్ని చర్చిస్తుంది. ఆ సాయంకాలం జరిగిన సంభవాలన్నీ సరియైన క్రమంలో నిశ్చయంగా చెప్పలేం.[2] అయితే వాటిని చెప్పడానికి యిది ఒక మార్గం.[3]

### స్పష్టమైన కార్యము (యోహాను 13:2-20)

వారిలో ఎవరు గొప్పవారో అని అపొస్తలులు వాదించుకొనడంతో గతపాఠం ముగిసింది (లూకా 22:24). ఆ భోజన సమయంలో వారి వివాదము ఒక ప్రత్యేకమైన సంఘటనకు దారి తీసినట్టుంది:[4]

> తాను ... భోజన పంక్తిలోనుండి లేచి తన పైవస్త్రము అవతల పెట్టివేసి, యొక తువాలు తీసికొని నడుమునకు కట్టుకొనెను. అంతట పళ్లెములో నీళ్లుపోసి శిష్యుల పాదములు కడుగుటకును, తాను కట్టుకొనియున్న తువాలుతో తుడుచుటకును మొదలు పెట్టెను (యోహాను 13:3–5).

అతిథి తన యింట ప్రవేశించినప్పుడు అతని కాళ్లు కడగడం ఆ దినాల్లో జరుగుతుండిన సాధారణమైన మర్యాద. అతిథి కాళ్ళను సేదదీరుస్తుంది. అంతేకాక దానికి మరొక ప్రయోజనం కూడ ఉంది. జనులు చెప్పులతో చెత్త రోడ్ల మీద నడుస్తారు. వాళ్ళు భోజనానికి కూచున్నప్పుడు ఒకళ్ళ కాళ్ళు మరొకళ్ళకి తగులుతూ ఉంటాయి.[5]

పస్కా భోజనానికి సిద్ధపాటుగా అపొస్తలులు స్నానంచేసి ఉంటారు (10 వ.); అయితే వారు ఈ మేడగది గుమ్మం దగ్గరకు రోడ్డుమీద నడిచివచ్చేసరికి, దుమ్ము వాళ్ళ కాళ్ళకి అంటుకుని ఉంటుంది. కాళ్లు కడుగు కొనడానికి కావలసిన వన్నీ సిద్ధంగానే ఉన్నాయి (4, 5 వచనాలు). అయితే ఒకని కంటె ఒకడు గొప్పవాడనుకొంటున్న వారిలో ఎవరూ తమ తోటి శిష్యుల కాళ్ళను కడగడానికి ఇష్టపడరు. ఆ పనిని సాధారణంగా, పని మనుషులు చేస్తారు!

తన రాజ్యంలో గొప్పతనం అంతస్థును బట్టిగాక, పరిచర్యమీదనే ఆధారపడి యుంటుందని ప్రభువు తన శిష్యులకు ముందుగానే బోధించియున్నారు. “నేను మీ మధ్య పరిచర్య చేయువానివలె ఉన్నాను” అని ఆయన తెలిపారు (లూకా 22:27). పరిచర్య చేయడమంటే ఆయన భావమేమో యిక్కడ ఆయన ప్రదర్శిస్తున్నారు – దాసుడు చేసే హీనమైన పనిని ఆయన తానే స్వయంగా చేస్తున్నారు. ఆయన వారి పాదములు కడుగుతున్నారు.

పాదాలు కడిగించుకొంటున్న యూదా పై లేఖనం ప్రత్యేకమైన దృష్టి నిలిపింది (యోహాను 13:2, 10, 11, 18, 19). “మీ శత్రువులను ప్రేమించండి”, వారికి మేలు చేయండి అనే ఆయన మాటలను ప్రభువు చేసి చూపుతున్నారు[6] (మత్తయి 5:44, 45; రోమా. 12:20 చూడు).

క్రీస్తు తన శిష్యుల పాదాలు కడిగిన పిమ్మట, తన మాదిరిని అనుసరించడానికి వారి యెదుట ఆయన సవాలును ఉంచారు (యోహాను 13:14–17). అంటే, ఆరాధనలో కాళ్ళు కడగడం అనే ఒక ఆచారాన్ని ఆయన దీనిద్వారా ప్రవేశపెడుతున్నారా?[7] తప్పక కాదు. J. W. McGarvey యిలా రాస్తున్నాడు:

> పాదాలు కడగడాన్ని యేసు స్థాపించలేదు; చిరపరిచితమైన దేశీయ ఆచారంగా ఆయన దీన్ని చూచారు, వినయమైన పరిచర్యకు తగిన స్వభావాన్ని కనుపరచడానికి కేవలం దాన్ని బహు అనుకూలమైన మార్గంగా ఉపయోగించుకున్నారు … పాశ్చాత్య ప్రజల మధ్య ఆతిథ్యం లేక మర్యాద అనే పేరుతో కాళ్ళు కడగడం అనే ఆచారం ఎన్నడే లేదు. క్రీస్తువారి ఈ మాటలను బట్టి దాన్ని ఆచరించడం కేవలం ఆయన భావాన్ని పోగొట్టుకొనడమే ఔతుంది.[8]

John F. Carter యిలా అన్నాడు: “క్రొత్త నిబంధన సంఘాల్లో ఏ ఒక్కటియు దీన్ని ఆదేశంగా ఆచరించినట్టు ఏ రుజువూ లేదు” “క్రీ. శ. 306 ప్రాంతంలో స్పెయిన్ దేశంలో, ఎల్విరావద్ద బిషప్స్ సభలో చేసిన డిక్రీగా చేయబడినట్టు సంఘ చరిత్రలో ఈ సంఘటన తొలిగా కన్పించింది అని అతడన్నాడు.”[9] “ప్రభురాత్రి భోజనంలాగ యేసు దానిని ఒక చట్టంగా రూపొందించలేదు, గాని నిజమైన అణకువ స్వభావానికి ఆయన ఆదర్శమైన పాఠాన్ని యిచ్చారు” అని H. I. Hester అన్నాడు.[10]

అపొస్తలుల పాదాలపై ఉన్న దుమ్ము తొలిగించాలనేది క్రీస్తు యొక్క ముఖ్య ఉద్దేశం కాదు. స్వార్థపరమైన వారి హృదయ వాంఛలపై ఆయన ఎక్కువ అక్కర కలిగియున్నారు. యూదాను మార్చడానికి యిది ప్రభువువారి చివరి ప్రయత్నంగా యిది చెప్పబడింది. క్రీస్తు యూదా పాదాల మీద దుమ్మును కడిగి వేశారు గాని అతని హృదయం అపవిత్రంగానే మిగిలి పోయింది (13:27).

## స్పష్టమైన ప్రకటనలు (మత్తయి 26:21-25, 31-35; మార్కు 14:18-21, 27-31; లూకా 22:21-23, 31-38; యోహాను 13:18, 19, 21-38)

**యూదాను గూర్చిన ప్రకటన (మత్తయి 26:21–25; మార్కు 14:18–21; లూకా 22:21–23; యోహాను 13:18, 19, 21–30)**

క్రీస్తు తన శిష్యుల పాదాలు కడుగుచుండగా ఆయన దిగ్భ్రమ కలిగించే ఒక ప్రకటనను చేశారు – ఆయన అప్పగించబడతారని – అందులో తన్ను అప్పగించేవాడు తనకు సన్నిహితుడేనని ఆయన ప్రకటించారు. లేఖనం నెరవేర్చబడుతుందని ఆయన తెలిపారు: "–నాతోకూడా భోజనము చేయువాడు నాకు విరోధముగా తన మడిమె నెత్తును" (యోహాను 13:18; కీర్తన 41:9 చూడు). "తూర్పు దేశాలలో యిద్దరు కలిసి భోజనం చేస్తున్నారంటే, స్నేహబంధము లేక నిబంధన ఉన్నట్టు సూచన.[11] యేసును అప్పగించడానికి ఆయన శత్రువులతో వెలకై ఒప్పందం కుదుర్చుకున్న యూదా ఆ పవిత్రమైన భోజనంతో నెమ్మదిగా పాలుపొందుతున్నాడు."[12]

"జరిగినప్పుడు నేను ఆయనను మీరు నమ్మునట్లు అది జరుగకమునుపు మీతో చెప్పుచున్నా"నని తాను అప్పగింపబడబోతున్న సంగతి క్రీస్తు తన అపొస్తలులకు తెలియజేశారు (యోహాను 13:19). ఆయన దైవమైయున్న సంగతి ముందుగా తెలిపిన వాస్తవాన్నిబట్టి నిర్ధారణ ఔతుంది. అప్పగించడం వింతగా ఏమి జరుగలేదని, అది ఆయన ఏర్పాటులను ఏ విధంగాను మార్చబోయేది లేదని, వారి విశ్వాసాన్ని కాపాడడానికి ఆయన ఆ మాటలు వారికి తెలిపారు.

"యేసు ఈ మాటలు పలికిన తరువాత ఆత్మలో కలవర"పడ్డారు (యోహాను 13:21ఎ). ఎంతటి భయంకరమైన సంగతులు పొంచి ఉన్నాయో అపొస్తలులకు తెలియదు, గాని క్రీస్తు వారికి అవి తేటగా తెలుసు. అపొస్తలులకు యింకా పరిపక్వపు స్థితి రాలేదని ఆయన వారి విషయమై అక్కర కలిగియున్నారు. పైగా, యూదా ద్రోహచర్య విషయంలో ఆయన హృదయం కుములుతూ ఉంది.

"–మీలో ఒకడు నన్ను అప్పగించునని" ఆయన తన అపొస్తలులతో రూఢిగా చెప్పారు (యోహాను 13:21బి; మత్తయి 26:21 చూడు). వారు కలత చెందారు (యోహాను 13:22). ఆయన ఎవరిని గూర్చి యీలాగు చెప్పెనో అని శిష్యులు తమలో తాము చర్చించుకున్నారు (లూకా 22:23). "అందుకు వారు బహు దుఃఖపడి ప్రతివాడును –

ప్రభువా, నేనా? అని అడుగ సాగారు"[13] (మత్తయి 26:22). అనాలోచితంగా చేసిన ఏ కార్యమైనా ''ఆయనను తన శత్రువులకు అప్పగించేలా చేస్తుందని వారు తలంచియుండవచ్చు."[14] అందువలన, "తప్పక నేనాపని చేయను" అని ప్రతివారు అనడం జరిగింది!

ప్రభువైన యేసు కుడివైపున కూర్చుండిన యోహాను, "ప్రభువా, వాడెవడని ఆయనను అడిగెను" (యోహాను 13:23-25[15]). "అందుకు యేసు-నేనొక ముక్క ముంచి యెవనికిచ్చెదనో వాడే అని చెప్పి,[16] ఒక ముక్క ముంచి సీమోను కుమారుడగు ఇస్కారియోతు యూదాకిచ్చెను" (యోహాను 13:26; మత్తయి 26:23 చూడు).

ప్రత్యక్షంగా చూపిన సాక్షం వలన దోషి ఎవ్వరో తెలుసుకోవచ్చని వేరుగా చెప్పనవసరం లేదు. అయినా, శిష్యులందరికి ఆ సంగతి తేటపడలేదు (యోహాను 13:28, 29). యూదా ఒకవేళ బాగా గౌరవించబడియుండేవాడేమో. అందులో యూదయలోనుండి వచ్చిన అపొస్తలుడు అతడు ఒక్కడే. తక్కినవారికంటె ఒకవేళ అతడు ఎక్కువగా చదువుకున్న వాడేమో. అతడు డబ్బుసంచిని మోసేవాడుగా ఘనపరచబడ్డాడు (యోహాను 13:29; యోహాను 12:6 కూడా చూడు). వారందరి పక్షంగా ధర్మం చేసే ముఖ్యమైన బాధ్యత అతనికి అప్పగింపబడినట్టుంది (యోహాను 13:29). ప్రభువు ఎన్నడూ అనుమానించని శిష్యుడెవడైనా ఉంటే, అతడు యూదాయేనని వారిలో ఎక్కువ మంది అనుకునే అవకాశముంది.

ప్రభువు కార్యాలను గాని ఆయన మాటలను గాని శిష్యులలో ఎక్కువమంది అర్థంచేసికొన్నట్టు లేరుగాని, యూదాకు మాత్రం సంగతి గ్రహింపయ్యింది. తక్కిన వారితో తానును జతకూడియున్నట్టు, నటిస్తూ అతడిలా అన్నాడు: "బోధకుడా, నేనా?" (మత్తయి 26:25ఎ). "ఆయన - నీవన్నట్టే"[17] అని బదులిచ్చారు (మత్తయి 26:25బి). తన పన్నాగం యిలా బయలుపడిన తరువాత యూదా సమూలంగా చలించియుండేవాడే, అయితే అతడు తొణికిసలాడినట్టు ఏ సూచనాలేదు. గాలి తాకిడికి మట్టి ఎండిపోయినట్టు, ప్రభువు యూదాను బయటపెట్టినా, అతని హృదయం కరుడుకట్టుకొని పోయినట్టుంది (యోహాను 13:27[18]).

"నీవు చేయుచున్నది త్వరగా చేయుమని" ప్రభువు వానితో చెప్పారు (యోహాను 13:27ఎ). ఆ ద్రోహి త్వరగా వదలి వెళ్లడానికి ఆయన యిష్టపడలేదు. ఎందుకంటే, ఆ రాత్రి ఆయన జరిగించవలసినది యింకా ఎంతో ఉంది. ఇప్పుడైతే, అతన్ని క్షేమంగా వదిలివేయవచ్చు. ఇక మిగిలిన కార్యక్రమానికి కావలసిన సమయం ఉంది. "వాడు, ఆ ముక్క పుచ్చుకొని వెంటనే బయటికి వెళ్లెను;[19] అప్పుడు రాత్రి వేళ"[20] (యోహాను 13:30).[21]

యూదా యొక్క ద్రోహచర్యను కొందరు సమర్థించ ప్రయత్నించారు.[22] కాని క్రీస్తు ప్రభువైతే, "యెవని చేత మనుష్యకుమారుడు అప్పగింపబడుచున్నాడో ఆ మనుష్యునికి శ్రమ; ఆ మనుష్యుడు పుట్టియుండనియెడల వానికి మేలని చెప్పెను" (మత్తయి 26:24; మార్కు 14:21 చూడు). "యేసు మాటలు యూదాను సమర్థించేవారి నోళ్లు మూయిస్తాయి. న్యాయాధిపతియే ఆ విధంగా దోషారోపణ చేస్తే, దానికి అనుకూలంగా వాదించి

నెగ్గేదెవడు?" అని McGarvey రాశాడు.[23]

**పేతురు మరియు యితర అపొస్తలులను గూర్చిన ప్రకటన (మత్తయి 26:31–35; మార్కు 14:27–31; లూకా 22:31–38; యోహాను 13:31–38)**

యూదా వెళ్లిపోయిన తరువాత (యోహాను 13:31ఎ),[24] ప్రభువు తక్కిన తన అపొస్తలులవైపు తిరిగారు. మహిమ పరచబడడాన్ని గూర్చి ఆయన మాట్లాడారు[25] (యోహాను 13:31బి–32) "పిల్లలారా,[26] యింకా కొంతకాలము మీతో కూడా ఉందును" (యోహాను 13:33ఎ). ఆయన చేయవలసింది ఎంతో కొద్దికాలంలోనే చేయవలసి యుంది!

ఆయన తన పలుకులను తిరిగి ఇలా చెప్పారు (యోహాను 13:33బి; యోహాను 7:33, 34;[27] 8:21). తరువాత, "మీరును ఒకరినొకరు ప్రేమింపవలెనని మీకు క్రొత్త ఆజ్ఞ ఇచ్చుచున్నాను; నేను మిమ్మును ప్రేమించినట్టే మీరును ఒకరినొకరు ప్రేమింప వలెను" (యోహాను 13:34). ఇది యితరులను ప్రేమించవలెనని ఆజ్ఞ గనుక యిది ఈ రూపంలో క్రొత్త ఆజ్ఞ కాదు; ఇది శతాబ్దాలుగా ఉన్న ఆజ్ఞయే (లేవీ. 19:18). అయితే యిది క్రొత్త ఆజ్ఞ ఎలా అయ్యిందంటే: "నేను మిమ్మును ప్రేమించినట్టే"! అన్నందున అది క్రొత్త ఆజ్ఞ అయ్యింది. "మీరు ఒకనియెడల ఒకడు ప్రేమగలవారైనయెడల దీనినిబట్టి మీరు నా శిష్యులని అందరును తెలిసికొందురు" (యోహాను 13:35). నీవు ఎంతగా లక్ష్యపెడుతున్నావో ఎరిగేవరకు నీకు ఎంత తెలుసో జనులు ఎరుగలేరని ఒక వ్యక్తి అన్నాడు.

"ఇంక కొంతకాలము మీతోకూడా ఉందును" (యోహాను 13:33ఎ) అనే మాటలను పట్టుకొని, పేతురు "ప్రభువా, నీ వెక్కడికి వెళ్లుచున్నావని ఆయనను అడుగగా, యేసు – నేను వెళ్లుచున్న చోటికి నీవిప్పుడు నా వెంట రాలేవు గాని, తరువాత వచ్చెదవని అతనితో చెప్పెను" (యోహాను 13:36). చనిపోడాన్ని గూర్చి ప్రభువు ఈ సంగతి చెప్పుతున్నది పేతురు గ్రహించలేదు, గనుక "పేతురు – ప్రభువా, నేనెందుకు ఇప్పుడు నీవెంటరాలేను? నీకొరకు నా ప్రాణము పెట్టుదునని ఆయనతో" చెప్పాడు (యోహాను 13:37).

"సీమోనూ, సీమోను, సాతాను మిమ్మును పట్టి గోధుమలవలె జల్లించుటకు మిమ్మును కోరుకొనెను" అని ప్రభువు బహు కనికరంగా[28] మాట్లాడారు (లూకా 22:31). అవసరములేని పొట్టును తొలిగించడానికి స్త్రీలు పిండిని[29] జల్లిస్తారు; ఆలాగే అపవాది అపొస్తలులను[30] "జల్లెడ" పట్ట కోరుకున్నాడు. ఒకడు ప్రభువును వదులకొనేలా అపవాది క్రియ చేశాడు (యోహాను 13:2, 27); వాడికి యింకా ఎక్కువమంది కావాలి.

నాయకుడును వక్తయునైనా పేతురుపైని వాడు దృష్టి ప్రత్యేకంగా నిలిపినట్టున్నాడు. ఆ సంగతి నెరిగిన ప్రభువు పేతురుతో యిలా అన్నారు: "నీ నమ్మిక తప్పిపోకుండునట్లు నేను నీకొరకు వేడుకొంటిని, నీ మనసు మరలిన తరువాత,[31] నీ సహోదరులను స్థిరపరచు"ము (లూకా 22:32). "అయితే అతడు – ప్రభువా, నీతోకూడ చెరలోనికిని

మరణమునకును వెళ్లుటకు సిద్ధముగా ఉన్నానని ఆయనతో అనగా" (లూకా 22:33), "నా కొరకు నీ ప్రాణము పెట్టుదువా?" (యోహాను 13:38) "నీవు నన్నెరుగనని ముమ్మారు చెప్పువరకు, నేడు కోడి కూయదని నీతో చెప్పుచున్నాననెను" (లూకా 22:34).[32]

మిగిలిన పదిమందివైపు ప్రభువు తిరిగి: "ఈ రాత్రి మీరందరు నా విషయమై అభ్యంతరపడెదరు, ఏలయనగా – గొఱ్ఱెల కాపరిని కొట్టుదును, మందలోని గొఱ్ఱెలు చెదరిపోవును అని వ్రాయబడియున్నది గదా" అని అన్నారు (మత్తయి 26:31; జెకర్యా 13:7 చూడు). అయితే, "నేను లేచిన తరువాత మీకంటె ముందుగా గలిలయకు వెళ్లెదననెను" (మత్తయి 26:32). గలిలయ వాగ్దానాన్ని కొంచెం జాగ్రత్తగా గుర్తు పెట్టుకో (మత్తయి 28:7, 10, 16; యోహాను 21:1). ఆయన పునరుత్థానము తరువాత, చెదరిన గొర్రెలను కాపరి సమకూర్చుకొనునట్లు, గలిలయలో[33] క్రీస్తు తన శిష్యులను సమకూర్చుకొనబోతున్నారు.

ప్రభువు మాటలను అంగీకరించడానికి పేతురు సిద్ధపడలేదు."నీ విషయమై అందరు అభ్యంతరపడినను నేను ఎప్పుడును అభ్యంతరపడనని" పేతురు ఆయనతో అన్నాడు (మత్తయి 26:33). ప్రభువు అతనితో తిరిగి యిలా అన్నారు: "ఈ రాత్రి కోడి కూయక మునుపే నీవు నన్ను ఎరుగనని ముమ్మారు చెప్పెదవని నీతో నిశ్చయముగా చెప్పు చున్నాను" (మత్తయి 26:34). అయితే "అతడు మరి ఖండితముగా – నేను నీతో చావవలసివచ్చినను నిన్ను ఎరుగనని చెప్పనే చెప్పననెను" (మార్కు 14:31ఎ). "అదే ప్రకారము శిష్యులందరు అనిరి" (మత్తయి 26:35బి).

రాబోతున్న విషమ సమయాలకు అపొస్తలులు సిద్ధంగా లేరన్న విషయం స్పష్టమైంది.[34] యెషయా 53:12 నుండి (లూకా 22:37) కోట్ చేస్తూ, తాను మరణించబోయే సంగతిని క్రీస్తు నిశ్చయం చేశారు. గతంలో తమను పంపినప్పుడు పొందిన అనుకూలమైన పరిస్థితులు, భవిష్యత్తులో ఉండాలని ఎదురుచూడవద్దని ఆయన తన శిష్యులను హెచ్చరించారు (లూకా 22:35, 36; మత్తయి 10; లూకా 10:1–16లను చూడు).

భవిష్యత్తుకొరకు సిద్ధపడవలెనని సలహాయిస్తుండగా, కత్తిని కొనుక్కొనుటను గూర్చి ఆయన ప్రస్తావించారు (లూకా 22:36). అక్షరార్థమైన కత్తులను గూర్చి ఆయన మాట్లాడినట్టు వారు తలంచి, తమయొద్ద రెండు కత్తులున్నవని వారు బదులిచ్చారు. అది చాలునని ఆయన తెలిపారు (లూకా 22:38). పన్నెండుమంది పోరాడడానికి రెండుకత్తులు ఎలాగూ చాలవు గనుక, క్రీస్తు అక్షరార్థంగా మాట్లాడడం లేదని అదే వారికి క్లూ యిచ్చి ఉండవలసింది.[35] ఏదియెలాగున్నా, వారు ఆయన మాటలు అర్థంచేసికోలేక పోయారు (లూకా 22:49–51)–తాను పొందబోయే మరణాన్ని గూర్చి వారు ఎలా గ్రహించలేకపోయారో, యిది కూడా అలాగే జరిగింది.

## కదిలించెడి ఏర్పాటు (మత్తయి 26:26-29; మార్కు 14:22-25; లూకా 22:19, 20; 1 కొరింథీ. 11:23-26)

పస్కా భోజనం ముగియవచ్చే సమయానికి,[36] ప్రభురాత్రి భోజనమనే నిరంతరం

నిలిచియుండే జ్ఞాపకార్థపు ఏర్పాటును ప్రభువు స్థాపించారు.[37] "వారు భోజనము చేయుచుండగా యేసు ఒక రొట్టెను పట్టుకొని" (మత్తయి 26:26ఎ; మార్కు 14:22; లూకా 22:19), అది పస్కాపండుగ సమయంలో ఉపయోగించే పులియని రొట్టె. "దానిని విరిచి – యిది మీకొరకైన నా శరీరము; నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడని చెప్పెను" (1 కొరింథీ. 11:24).

"ఇది నా శరీరము" అంటూ ప్రభువు అలంకారిక భాషను ఉపయోగించారు.[38] ఒక ఫోటోను చూపుతూ "వీరు నా పిల్లలు" అనేది ఎలాగైతే విశేషణమో, యిది కూడ అలాటిదే. రోమా సిలువపై త్వరలోనే వ్రేలాడదీయబడే దేహానికి బదులుగా రొట్టెను చూపి ఇది నా శరీరమని క్రీస్తు అన్నారు.

"ఆ ప్రకారమే భోజనమైన పిమ్మట ఆయన పాత్రను[39] ఎత్తికొని" (1 కొరింథీ. 11:25ఎ). అది "ద్రాక్షారసముతో నింపబడిన పాత్ర" (మత్తయి 26:29), "కృతజ్ఞతా స్తుతులు చెల్లించి వారికిచ్చి – దీనిలోనిది మీరందరు త్రాగుడి;[40] ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకులకొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము' '[41] (మత్తయి 26:27, 28 మార్కు 14:24; లూకా 22:20లను చూడు). ఈ ప్రతిపాదన చేయడంలో, తన చిత్తాన్ని జరిగించేవారికి పాపక్షమాపణను అనుగ్రహించడం ఆయన మరణంలోని ప్రధాన ఉద్దేశమైయుంది (1 కొరింథీ. 15:3; ఎఫెసీ 1:7లను చూడు).

"నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడని చెప్పెను" (1 కొరింథీ. 11:25బి). ఈ మాటలతో ఆయన తరువాత యిలా చేర్చారు, "నా తండ్రి రాజ్యములో మీతో కూడ నేను ఈ ద్రాక్షారసము క్రొత్తదిగా త్రాగు దినమువరకు, ఇకను దాని త్రాగనని మీతో చెప్పుచున్నా" ను (మత్తయి 26:29). ముందుగానే గమనించినట్టు, రాజ్యముయొక్క భూసంబంధమైన ప్రతిరూపము సంఘమే. సంఘము ప్రభువు రాత్రి భోజనములో పాలుపొంద కూడిన ప్రతిసారి, అది క్రీస్తుతో పాలుపొందుతూ ఉంటుంది. పౌలు యిలా రాశాడు;"మనము దీవించు ఆశీర్వచనపు పాత్రలోనిది త్రాగుట క్రీస్తు రక్తములో పాలుపుచ్చుకొనుటయే గదా?–మనము విరుచు రొట్టె క్రీస్తు రక్తములో పాలుపుచ్చు కొనుటయేగదా?" (1 కొరింథీ. 10:16, 17).

ఆయన తిరిగి వచ్చు పర్యంతము ప్రభువురాత్రి భోజనం నిత్యమూ కొనసాగాలని క్రీస్తు కోరాడు (1 కొరింథీ. 11:26). ఈ జ్ఞాపకార్థపు విందులో ఆది సంఘము ప్రతి ఆదివారం పాలుపొందేది,[42] నేటికిని అదే ఆచారం కొనసాగింపబడుతుంది.

## ముగింపు

"ఎన్నటికి మరువకూడని రాత్రిలో కొద్ది గంటలను" మనం చూచాం.[43] యోహాను 14–16లో ప్రభువువారి వీడ్కోలు చర్చను, మరియు ఆయన విజ్ఞాపనా ప్రార్థనను యోహాను 17 సర్వేచేస్తు, ఆ మరువరాని రాత్రిని గూర్చి యింకా కొంచెం తెలిసి కొందాం. ఇది తరువాత పాఠమైయుండబోతుంది. నీ జీవితంలో "ఎన్నడూ మరువ కూడని దినంగా" దీనిని చేసుకొంటావని నిరీక్షిస్తున్నాను.

## నోట్సు

"గుర్తుంచుకోవలసిన రాత్రి" అని దీన్ని పిలువ వచ్చు. ఇందులో ప్రధాన భాగాలు: (1) గుర్తుంచు కోవలసిన కార్యం, (2) గుర్తుంచు కోవలసిన ప్రకటన, (3) గుర్తుంచుకోవలసిన ఏర్పాటు.

వీటిలో ప్రతి ఒక్క దానిపైన కూడా ప్రసంగించవచ్చు. యూదా ప్రభువును అప్పగించడం, పేతురు ప్రభువును ఎరగననడం వారి శీలాన్ని చదివే భాగమైయుండవచ్చు. ప్రభువు రాత్రిభోజనము మీద ప్రసంగంలో "నన్ను జ్ఞాపకం చేసికొనుటకు దీనిని చేయుడి" అనేది వివరించవచ్చు.

ఈ పాఠంలోని వాక్య భాగాలను ప్రసంగం కొరకు ఉపయోగించవచ్చు. మత్తయి 26:21, 22లను "స్వయంసాధ్యమై" మత్తయి 26:25ను "జన్మించకయుంటె బాగుండునను మనిషి"[44] గురించి ప్రసంగించుటకు ఉపయోగించాడు. యోహాను 13:34, 35, "శిష్యుల బ్యాడ్జి" అనేది ప్రేమ విషయమై గాఢతను చూపుట అను దానిలో కానవస్తుంది.[45]

---

సూచనలు

[1]యేసు ప్రభురాత్రి భోజనమును ప్రవేశపెట్టిన వివరాలు 1 కొరింథీ. 11:23–26లో ఉన్నందున ఇక్కడ చేర్చడమైనది. 1 కొరింథీ. 11:23–26 ఈ సంభవమును గూర్చి తెలిపిన దైవప్రేరేపిత రచనలలో తొలిదైయుండవచ్చు. కొరింథీయులకు రాసిన మొదటి పత్రిక బహుశ క్రీ.శ. 50లో, "సినాప్టిక్ గాస్పల్స్" (మొదటి మూడు రచనలు), క్రీ.శ. 60లో రాసియుండవచ్చు. [2]సంఘటనల క్రమ వరుసలలో సువార్తలలో పోల్చి సూచినప్పుడు చాల వ్యత్యాసం కనిపిస్తుంది. రచయితలకు కాల క్రమంగా అంత ముఖ్యం కాదనేది తరచుగా గమనించవచ్చు. [3]కొన్ని చిన్న వ్యత్యాసాలను గమనించు. [4]ఎక్కువ వివరాలకు "యజమానుని కలుసుకో," "తువాలను గూర్చిన పాఠం" చూడు. [5]"క్రీస్తు జీవితం, 2" చూడు. [6]యూదా పాదములను యేసు కడిగినప్పుడు యూదా అనుమానించని శిష్యులు ఈ పాఠమును గ్రహించియుండక పోవచ్చు – అయితే నేడు మనం గ్రహించవచ్చు. [7]ఇంకా వివరాలకు "యజమానుని కలుసుకో"లో చూడు. [8]J. W. McGarvey and Philip Y. Pendleton, *The Fourfold Gospel or A Harmony of the Four Gospels* (Cincinnati: Standard Publishing Co., 1914), 650. [9]John Franklin Carter, *A Layman's Harmony of the Gospels* (Nashville: Broadman Press, 1961), 285-86. పాదాలు కడగడమనేది సంఘ చట్టం ఎన్నటికి కాకుండడానికి మూడు కారణాలిచ్చాడు. అతడు Albert Henry Newmanను కోట్ చేశాడు, *A Manual of Church History* (Philadelphia: American Baptist Publications Society, 1904), 1:140. [10]H. I. Hester, *The Heart of the New Testament* (Liberty, Mo.: Quality Press, 1963), 197.

[11]క్రొత్త నిబంధనలో దీనికి అనేక సూచనలు యివ్వబడ్డాయి; ఉదాహరణకు, ప్రకటన 3:20. [12]Carter, 287-88. [13]"ప్రభువా, నేనా?" అని గ్రీకు మూలమును తర్జుమా చేయవచ్చు. అయితే గ్రీకులో ప్రశ్నార్ధకమైన సమాధానం "ప్రభువా, నిజముగా నేను కాదు" NASBలో ఉన్నట్టు. [14]Carter, 288. [15]యేసు ప్రేమించిన శిష్యుడని యోహాను తన్ను గూర్చి చెప్పుకొన్నట్టు అనేకులు నమ్ముతారు. [16]ముక్క ముంచి చేతికి అందించడమనేది గౌరవ సూచన అని McGarvey అంటాడు (McGarvey and Pendleton, 653). [17]"నీవన్నట్టే" అనేది "నేను కాదు నీవే అంటున్నావు" అని అర్థమిస్తుంది (మత్తయి 26:64 చూడు). [18]సాతాను యూదాలో ప్రవేశించి, సభవద్దకు వెళ్లేలా అతని ప్రేరేపించాడు (లూకా 23:3, 4). ప్రభువు మాటల వలన యూదా కదిలింపబడియుండవచ్చు గాని, అతడు అపవాది ఆలోచనలకు తలవొగ్గాడు. [19]పండుగకొరకు ఏదైనా కొంటానికి వెళ్లినట్టు కొందరు తలంచారు (యోహాను 13:29). పస్కాపండుగ ఒకనాటితో ముగిసిన తరువాత వారం రోజులు పులియని రొట్టెలు తింటూ ఉండాలి. తరువాత కొనడానికి యూదా వెళ్లినట్టు వారు తలంచారు. [20]"అది రాత్రివేళ" అనేది సమయాన్ని సూచిస్తుంది. ఈ ప్రయోగంలో ఏదో భయానకమైనది ఉన్నట్టు కొందరు ఫీలౌతారు

(McGarvey and Pendleton, 654).

[21]తన పన్నాగం బయలుపరచబడిన తోడనే యూదా వెళ్లి పోయి ఉంటాడు. ప్రభురాత్రి భోజనపు ఏర్పాటు యూదా విషయం బయట పెట్టబడినట్టుంది (లూకా 22:19–23). మార్కు, మత్తయిల్లో దీనికి ముందు అన్నట్టుంది (మత్తయి 26, 25, 26; మార్కు 14:21, 22). [22]మరి కొన్ని వివరాలకు "సిద్ధపడుట" అనే పాఠమును చూడు. [23]McGarvey and Pendleton, 653. [24]పేతురు ఎప్పుడు యేసును ఒప్పుకొనడు అనే విషయాన్ని యేసు ఎప్పుడు ముందుగా తెలియజేసాడో స్పష్టంగా లేదు. యేసు మరియు ఇతరులు మేడగదిని విడిచి వెళ్ళుటకు ముందు (లూకా 22:39; యోహాను 14:31) ప్రవచించినట్టుగా లూకా మరియు యోహాను (లూకా 22:34; యోహాను 13:38) తెలిపారు. ఈ విషయాన్ని గూర్చి రెండు సార్లు తెలిపియుండవచ్చని నా అభిప్రాయం. [25]ఇది ఆయన మరణ, సమాధి, పునరుత్థానాలకు అలంకారంగా చూపబడింది (యోహాను 7:39; 12:16, 23, 28 చూడు). [26]నాకు తెలిసినంతవరకు ఈ ఒక్కమారు మాత్రమే ఈ పదాన్ని యేసు ఉపయోగించారు. ఆ పదం యోహానుగారికి ప్రియమైనదిగా మారినది (1 యోహాను 2:1, 12, 28; 3:7, 18; 4:4; 5:21). [27]యోహాను 7:33, 34లపై వివరాలకు "క్రీస్తు జీవితం, 4"ను చూడు. [28]దేవుడు వానికి అనుమతి యిచ్చినంతవరకే అపవాది పనిచేయగలడు (యోబు 1, 2). ఇది "బలమైన ఆహారం" (హెబ్రీ. 5:12–14), చర్చకొరకు నీకిష్టమైనదానిని ఉపయోగించు. [29]నీ శ్రోతలకు అర్థమయ్యే ఉదహరణను వివరించు. [30]లూకా 22:31లో "నీవు" అనేది గ్రీకులో బహు వచనం.

[31]"నీ మనస్సు తరువాత"–అనడంలో పేతురు పడిపోవడమే అంతంకాదని తెలుస్తుంది. [32]మత్తయి, లూకా, యోహానులు కోడి ఒక సారి కూయడాన్ని సూచించారు (మత్తయి 26:34; లూకా 22:34; యోహాను 13:38. మార్కైతే రెండుసార్లు అని ప్రస్తావించాడు (మార్కు 14:30). ఈ వ్యత్యాసం అంత ప్రాముఖ్యమయ్యింది కాదు. [33]ఒక్క సారే అయిదువందల మందికి ఆయన కన్పించడం (1 కొరింథీ. 15:6) గలిలయలో అయ్యుండవచ్చు. [34]మత్తయి, లూకా, యోహాను ఒక్కసారి కోడి కూయుటను ప్రస్తావించారు (మత్తయి 26:34; లూకా 22:34; యోహాను 13:38), అయితే మార్కు రెండింటిని ప్రస్తావించారు. [35]సువార్త నిమిత్తము ఎదురయ్యే కష్టాలను ఆయన ఖడ్గము అని సూచించారు (మత్తయి 10:34). రాబోయే కష్టాల నిమిత్తము ఆయన తన శిష్యులను సిద్ధపరచుతున్నారు. [36]వారు చేస్తున్న పస్కా భోజనానికి అంతంలో ప్రభురాత్రి భోజనాన్ని స్థాపించినట్టుంది. వారు భోజనము చేయుచుండగా అని ఉంది (మత్తయి 26:26; మార్కు 14:22). భోజనమైన పిమ్మట అని (1 కొరింథీ. 11:25లో) ఉంది. [37]ప్రభురాత్రి భోజనము గూర్చిన ఎక్కువ వివరాలకు "నన్ను జ్ఞాపకము చేసికొనుటకు దీనిని చేయుడి" అనే పాఠమును చూడుడి. [38]దీన్ని రూపకాలంకారమంటారు. "వలె, వంటి" అనే పదాలను ఉపయోగించకుండ ఒక దానిని మరియొక దానితో పోల్చడం … బైబిలు నిండా ఈ రూపకాలంకారాలు ఉపయోగించబడ్డాయి. [39]ఇది కొందరు పస్కా పండుగలోని మూడవ పాత్ర అంటారు. అది ఇశ్రాయేలీయులకు నిర్గమ. 6:6, 7లోని మూడవ వాగ్దానాన్ని జ్ఞాపకం చేస్తుంది: "నేను మిమ్మును విడిపించెదను". ఈ పద ప్రయోగం ప్రభురాత్రి భోజనముతో సరిపోతుంది. "భోజనమైన పిమ్మట" యేసు పాత్ర నెత్తుకొని అనే పౌలు యొక్క ప్రతిపాదనలో పౌలు చెప్పిన నాల్గు పాత్రలో ఇది మూడవది (1 కొరింథీ. 11:25). [40]"దీనిలోనిది త్రాగుడి" అనేవి పాత్రను ఖాళీ చేయటం కాదు, అయితే "దీనిని అందరు త్రాగుడి" NASB సూచించినట్లు.

[41]రక్తము చిందించడంవలన పాత, క్రొత్త నిబంధనలు స్థిరపరుస్తుంది. [42]దీనికి సంబంధించిన చర్చను "నన్ను జ్ఞానపకము చేసికొనుటకై దీనిని చేయుడి" అనే పాఠములో చూడు. [43]పస్కా భోజనం రెండు లేక మూడు గంటల కాలం తీసుకొంటుంది. [44]Foy L. Smith, *Lord's Day Evening Sermons*, vol. 1 (El Dorado, Ark.: Foy L. Smith, 1944), 18-25, 53-59. [45]David L. Roper, *Getting Serious About Love* (Searcy, Ark.: Resource Publications, 1992), 167-84.